క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

పాల్వంచరూరల్: పాండురంగాపురం తండాలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పురోహితులు కందాల సింహాద్రి ఆనంద కుమారాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కొత్వాల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు జగదీష్‌కుమార్, లక్‌పతి, కుమార్, చిన్నవీరు, లాలు, యర్రంశెట్టి ముత్తయ్య, ఇస్లావత్‌దేవి, అంకయ్య, మధు, రోశయ్య, వెంకన్న పాల్గొన్నారు.

చర్చిలో వీబీఎస్ సమ్మర్ క్యాంపు

సింగరేణి(కొత్తగూడెం): రామవరంలోని నాగయ్యగడ్డలోని ప్రత్యక్షత చర్చిలో ఆదివారం వెకేషన్ బైబిల్ స్కూల్ (వీబీఎస్) సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు బైబిల్ గురించి వివరించి, నాటిక, పాటల పోటీలు నిర్వహించారు. మదర్ బిన్ను, ఫ్యామిలీ సభ్యులు, పిల్లలు పాల్గొన్నారు.

ప్రమాద బీమా అందజేత

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి మణుగూరు ఓపెన్ కాస్ట్‌లో టెక్నికల్ ఆపరేటర్‌గా పనిచేసిన ముల్చంద్ దురదృష్టవశాత్తు మణుగూరు ఓపెన్ కాస్ట్‌లో జరిగిన ప్రమాదంలో మరణించారు. ఎస్‌బీఐలో జీతం ఖాతాను నిర్వహిస్తున్న ప్రతీ సింగరేణి ఉద్యోగి కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.1 కోటి బీమా కవరేజీని అందిస్తోంది. ఇందులో భాగంగా బ్యాంక్ అధికారులు నామినీ హరిదేవికి రూ.1 కోటి చెక్కును ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా ప్రారంభించారు. కార్యక్రమంలో చంద్రగిరి శ్రీనివాసరావు, సపవత్ రవి, గౌడ సంఘం నాయకులు గుండ్ల నరసయ్య, క్లెం సత్యనారాయ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లోని జిల్లా గ్రంథాలయానికి సీనియర్ సిటిజన్స్ విద్యానగర్ కాలనీ వారి ఆధ్వర్యంలో రూ.10 వేల విలువ చేసే వాటర్ కూలర్‌ను ఆదివారం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ రెహమాన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు జి.మణిమృదుల కోట్ల నాగేశ్వరరావు, సురేష్ కుమార్, ధర్మరాజు, కేశవరావు పాఠకులు పాల్గొన్నారు.

వార సంతలో అవస్థలు


బురదమయంగా మారిన వారపు సంత


వర్షం వస్తుండగా సర్దుకుంటున్న వ్యాపారులు

- వర్షానికి తడిసినా రుసుము చెల్లించాల్సిందే..
- ప్లాట్‌ఫాం, షెడ్‌లు లేక ఇబ్బందులు
- మౌలిక సౌకర్యాలు కల్పించాలంటున్న వ్యాపారులు

కొత్తగూడెంఅర్బన్: ఎండ, వాన, చలి ఇలా ఎటువంటి వాతావరణంలోనైె అవస్థలు పడుతూ గత మున్సిపాలిటీ, ప్రస్తుత కార్పొరేషన్ వారు అప్పగించిన కాంట్రాక్టర్‌కు రుసుము చెల్లించాల్సి వస్తోంది. కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సింగరేణి హెడ్డాఫీసుకు సమీపంలో ప్రతీ ఆదివారం నడుస్తున్న వారపు సంతలో చిరు వ్యాపారులు, రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రతీ ఏటా అధికారులు వారపు సంతకు వేలంపాట నిర్వహించి కాంట్రాక్టర్‌కు అప్పగిస్తున్నారు. రూ.లక్షల్లో పాటను పెంచుతున్నారు. అదే విధంగా ఆదాయం కూడా సమకూరుతోంది. కానీ సంతలో కనీస సౌకర్యాలను మాత్రం కల్పించడం లేదు. గతంలో కౌన్సిల్ ఉన్న సమయంలో కూడా వారపు సంతలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదు. కౌన్సిల్ సమయకాలం అయిన తరువాత కూడా అధికారులు సంతను పట్టించుకోకపోవడం వలన అక్కడ వ్యాపారం చేసే వారు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ అయింది, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు కూడా కార్పొరేషన్‌కు వచ్చే అవకాశం ఉంది.

వారపు సంతకు కొత్తగూడెంతో పాటుగా చుట్టు పక్కల మండలాలు చుంచుపల్లి, సుజాతనగర్, జూలురుపాడు, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లిల నుంచి ఎక్కువ సంఖ్యలో చిరు వ్యాపారులు, రైతులు వచ్చి తాత్కాలికంగా దుకాణాలను ఏర్పాటు చేసి కూరగాయలు, ప్లాస్టిక్ సామగ్రి, నిత్యావసర వస్తువులు, దుస్తులు, ఇళ్ల అవసరాలకు ఉపయోగపడే సామగ్రి, గొర్రెలు, మేకలు, ఆవులు, చేపల అమ్మకాలు చేస్తుంటారు. అయితే ఆయా తాత్కాలిక షెడ్‌లలో ఎండ, వాన, చలికి ఇబ్బందులు పడుతూ వ్యాపారం చేసుకుంటున్నారు. వారితో పాటుగా వాటిని కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులు కూడా తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ప్లాట్‌ఫాం లేక అవస్థలు ...

కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని వారపు సంతలో ప్రతీ ఆదివారం 300 వరకు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారులు వివిధ రకాల అమ్మకాలు చేస్తుంటారు. అయితే ఆదివారం ఉదయం నుంచి ఎండ దంచికొట్టింది. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి 15 నిమిషాల పాటు భారీగా వర్షం కురిసింది. దీంతో సంతలోని తాత్కాలిక దుకాణాలు కొట్టుకపోయాయి. సామగ్రితో సహా సరకు పూర్తిగా తడిసిపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంతలో షెడ్ల నిర్మాణం చేయాల్సిన అవసరముందని, షాపులు పెట్టినందుకు ఫీజు చెల్లిస్తున్నా ఎటువంటి సౌకర్యం కల్పించడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటుగా వర్షం పడడం వలన నేలంతా బురదమయంగా ఉంది. ఆ బురదలోనే ఇబ్బందులు పడుతూ అమ్మకాలు చేస్తున్నారు. కనీసం సంతలో ప్లాట్‌ఫాం నిర్మాణం చేయాలని కోరుతున్నారు. వినియోగదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టి వారపు సంతలో షెడ్‌లు, ప్లాట్‌ఫాం నిర్మాణం చేయించాలని చిరువ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి..

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల పెంపు లక్ష్యంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో పాఠశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలపై తల్లిదండ్రులను స్వయంగా కలిసి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు, సకల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని గుర్తుచేశారు.

జూలూరుపాడు: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ ఆదివారం ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జూలూరుపాడు హైస్కూల్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సురారం, వీరభద్రాపురం గ్రామాల్లో పర్యటించి, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జూలూరుపాడు హైస్కూల్ ఉపాధ్యాయులు రాంశెట్టి శ్రీనివాసరావు, నంద్రు గురుమూర్తి, బొడా కృష్ణ, తల్లిదండ్రులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం మోదీతోనే సాధ్యం

టేకులపల్లి: దేశంలో పేద ప్రజల సంక్షేమానికి ప్రధాని మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర గిరిజన అధికార ప్రతినిధి భూక్యా శ్రీను నాయక్ అన్నారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదేశానుసారం వికసిత్ భారత్ అమృత కాలం, సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం విజయవంతంగా 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం టేకులపల్లిలో జరిగింది. మాట్లాడుతూ.. గ్రామాల్లో, పట్టణాల్లో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో శంభు నాయక్, ధరావత్ ద్రావ్ సింగ్, వెంకటేశ్వర్లు, బాలాజీ నాయక్, హతీరాం నాయక్, పూన్యా నాయక్, నాగేందర్, లక్పతి నాయక్, వినోద్, రాందాస్, బాల, రాజు, నవీన్, జమాల్, అప్పారావు, గంగ పాల్గొన్నారు.

రేపు సీపీఐ మహాసభ

పాల్వంచరూరల్: పాండురంగాపురం గ్రామంలో ఈనెల 10వ తేదీన సీపీఐ 19వ మండల మహాసభ జరగనుంది. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మహాసభకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం హాజరు కానున్నట్లు తెలిపారు.

పారిశుధ్యం అధ్వానం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్, ధన్‌బాద్, మార్కెట్ ఏరియాలలో పారిశుద్ధ్యం లోపించింది. కాలనీలలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం యాజమాన్యం రూ.కోట్లు చెల్లించి కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు చేయిస్తున్న పారిశుద్ధ్య పనులను సంబంధిత సూపర్‌వైజర్ పర్యవేక్షణ చేయాల్సి ఉంది. వీరి నిర్లక్ష్యానికి కాంట్రాక్టర్ అసమర్థత తోడవడంతో కార్మికవాడల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అసలే వర్షాకాలం కారణంగా దోమలు కాలువల్లో, చెత్తకుప్పల్లో తాండవం చేయటం ద్వారా కార్మికులు సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఏరియా ఉన్నతాధికారులు ఏసీ రూములను వీడి కాలనీలలో పర్యవేక్షణ చేయాలని, పారిశుద్ధ్యం పనులు చేయించాలని కార్మికులు, కుటుంబసభ్యులు కోరుతున్నారు.

పాల్వంచ అభివృద్ధిపై హామీ ఇవ్వండి..


సమావేశమైన పట్టణ ప్రముఖులు

పాల్వంచ: పాల్వంచ అభివృద్ధిపై పాలకులు స్పష్టమైన హామీ ఇవ్వాలని పాల్వంచకు చెందిన పలువురు ప్రముఖులు అన్నారు. ఆదివారం స్థానిక జే పార్క్ హోటల్‌లో ఫోరం ఫర్ బెటర్ పాల్వంచ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పట్టణ పూర్వ వైభవం కోసం ఫోరం కృషి చేస్తోందన్నారు. మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, ఎన్ఎండీసీ పునరుద్ధరణ, కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఐటీ హబ్, ఇండస్ట్రియల్ పార్క్, ఆటో నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేగాక కరకవాగు ప్రాంతంలో రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని, కిన్నెరసాని జూ పార్క్‌ను మరింత అభివృద్ధి చేయాలని, ఎమ్మెల్యే పాల్వంచ ప్రజల సందేహాలు నివృత్తి చేసేందుకు అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకం అభివృద్ధి చేసి టూరిజం హబ్‌గా మార్చాలన్నారు. కార్యక్రమంలో నూకల రంగారావు, మంతపురి రాజుగౌడ్, కాల్వ భాస్కర్, బుడగం రవి, కాపా కృష్ణమోహన్, వై.సాంబశివరావు, సైదులు, కట్టా వెంకటనారాయణ, కల్యాణం లక్ష్మీపతి, అభినవ్, శ్రీనివాసకుమార్, బద్ది కిషోర్, పానిశెట్టి వెంకటేశ్వర్లు, తులసీరాం, ఆరుద్ర సత్యనారాయణ, సాధం రామకృష్ణ, మంజూరు, దున్న పోతుల రాజు, జైన్‌కుమార్, రవిగౌడ్ పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణమే లక్ష్యం



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

కొత్తగూడెంఅర్బన్: దోపిడీ, అణచివేతకు గురవుతూ దుర్భరజీవితం గడుపుతున్న ఏజెన్సీ పల్లె ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నాంది పలికి ఆధునికత వైపు నడిపించింది ఎర్ర జెండానేనని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం, బంగారుచెలక, చింతకుంట, పునుకుడు చెలక, లక్ష్మీపురం, బొజ్జలగూడెం గ్రామపంచాయతీల పరిధిలోని 31 గ్రామశాఖల సంయుక్త మహాసభ తిప్పగుట్ట గ్రామంలో జరిగింది. మహాసభ సందర్భంగా గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి మహాసభను ప్రారంభించి సాబీర్ పాషా మాట్లాడారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం, దోపిడీ, అణచివేతలు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందన్నారు. ఉమ్మడి బంగారుచెలక, మైలారం గ్రామపంచాయతీ పరిధిలో పేదల పక్షాన నిలబడి అనేక భూపోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించిందరన్నారు. అనంతరం 31 గ్రామాల నూతన కమిటీలను పార్టీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో చంద్రగిరి శ్రీనివాసరావు, దీటి లక్ష్మీపతి, నూనావత్ గోవిందు, కంటెం సత్యనారాయణ, దారా శ్రీనివాసరావు, జోగా రామయ్య, సపావట్ రవి, బానోత్ నెహ్రూ, జర్పుల ఉపేందర్, పరిపర్తి రాజు, జోగా రాజబాబు, కోడి లింగయ్య, జలీల్ పాషా, శర్వన్, జనార్దన్, లాలూ, లక్ష్మీనారాయణ, వరుస రామస్వామి, ముత్తయ్య, మోహన్, శంకర్, గోపాల్, జానయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి..


పూబెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న చైతన్యకుమార్

ఇల్లెందురూరల్: వర్షాకాలం ప్రారంభమైనందున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ సీఈ చైతన్యకుమార్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన పూబెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని ఆదివారం ఆయన పరిశీలించారు. గ్రామంలో మొత్తం 84 మందికి ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 63 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని తెలుసుకొని ప్రతీ ఇంటికి వెళ్లి ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ సామగ్రి ధరలు, తాపి మేస్త్రీలకు ఇస్తున్న కూలీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా అందించేందుకు గృహనిర్మాణ శాఖ అధికారులకు.. రెవెన్యూశాఖ అధికారులు పలుమార్లు లేఖ పంపారని, త్వరలోనే ఉచిత సరఫరా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అనంతరం సుభాష్‌నగర్, బాలాజీనగర్ గ్రామపంచాయతీలలో ఇళ్ల స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ స్వాతి, పూబెల్లి, బాలాజీనగర్ గ్రామపంచాయతీ కార్యదర్శులు బాలకృష్ణ, రాజు పాల్గొన్నారు.

'మైనార్టీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం'

కొత్తగూడెంఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం కేబినెట్‌లో మైనారిటీలకు మంత్రి పదవి కేటాయించకుండా మొండిచేయి చూపించిందని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనారిటీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. మైనారిటీ మంత్రి లేని కారణంగా అనేక మైనారిటీ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీ గురుకులాలు ఇరుకైన కిరాయి భవనాల్లో, అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయని, ఇప్పటి వరకు మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు కానీ, మైనారిటీ స్టడీ సర్కిళ్లు లేవని పేర్కొన్నారు. అలాగే వక్ఫ్ భూముల సర్వే, వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు వంటి కీలక అంశాల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమాన్ని విస్మరిస్తోందని, ఇది తగదని వాపోయారు. ఇప్పటికైనా సీఎం స్పందించి త్వరలో జరగనున్న క్యాబినెట్ విస్తరణలో మైనారిటీలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఇల్లెందురూరల్: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు, నాటి గురువులు


ఇల్లెందు: 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ఇల్లెందు: పట్టణంలోని మార్గదర్శి ఇంగ్లిష్ మీడియం స్కూల్ 2001 – 02 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఐతా ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత నాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా తమ కష్టసుఖాలు, చదువుకున్న రోజుల గుర్తులను మననం చేసుకుని గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థులు గోపీకృష్ణ, సతీష్, రాము, శ్రీనివాస్, సందీప్, సరస్వతి, స్రవంతి, నిర్మల పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. పాఠశాలలో 2005-06 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఇరవై ఏళ్ల తరువాత కలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. చందు, ప్రసాద్, సురేష్, రమేష్, శ్రీను, కృష్ణవేణి, మమత పాల్గొన్నారు.

మృగశిర సందడి..


సూపర్‌బజార్(కొత్తగూడెం): సంతలో...


ఇల్లెందు: చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మృగశిర కార్తె.. ఆదివారం.. కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో చేపల మార్కెట్లు, చెరువులు వినియోగదారులతో కిటకిటలాడాయి. ఇల్లెందు మండలం పూబెల్లి గ్రామంలో చెరువు వద్ద ఘర్షణ జరిగింది. పోలీసులు రావాల్సి వచ్చింది. పలుచోట్ల వ్యాపారులు ధరలు పెంచి విక్రయించారు. ఇదిలా ఉండగా సొసైటీ ఆధీనంలో లేని పంచాయతీ చెరువులలో ప్రజలు అధిక సంఖ్యలో చేపలు పట్టేందుకు ఉత్సాహం చూపారు. వలలు, గాలాలతో చేపలను చేజిక్కించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


జూలూరుపాడు: చెరువు వద్ద వినియోగదారులు


టేకులపల్లి: దాసుతండా కుంట వద్ద చేపల కోసం ఎగబడుతున్న జనం


జూలూరుపాడు: పుల్లుడుతండా చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు


ఇల్లెందురూరల్: కొత్తూరు చెరువులో చేపలు పడుతున్న స్థానికులు

మినీ ట్యాంక్ బండ్ పనుల్లో జాప్యం

- రూ.10కోట్లతో పాల్వంచ చింతల చెరువు ఆధునీకీకరణ
- రెండేళ్లు గడుస్తున్నా కొలిక్కిరాని పనులు


పాల్వంచ చింతల చెరువు ట్యాంక్ బండ్

పాల్వంచ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల్లో చెరువులను ట్యాంక్ బండ్‌లుగా తీర్చిదిద్దుతున్నారు. జిల్లాలో పలుచోట్ల ట్యాంక్ బండ్‌లకు నిధులు మంజూరు కాగా ఆ పనులు చాలా చోట్ల పూర్తయ్యాయి. అయితే పాల్వంచలోని చింతల చెరువు అభివృద్ధి పనులు మాత్రం నత్తనడక సాగుతున్నాయి. 2023 అక్టోబర్‌లో రూ.10కోట్ల నిధులతో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఈ పనులు అనుకున్న స్థాయిలో జరగడం లేదు. ఇప్పటికే కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు కార్పొరేషన్ అయిన నేపథ్యంలో హైవే పక్కనే ఉన్న ఈ చింతల చెరువు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

మినీ ట్యాంక్ బండ్‌తో మారనున్న రూపురేఖలు...

చింతల చెరువుకు మంజూరు అయిన నిధులతో ఆధునికీకరణ పనులు పూర్తయితే రూపురేఖలు మారనున్నాయి. చెరువు కట్టపై 15 మీటర్ల మేర రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. 1.150 మీటర్ల బీటీ నిర్మాణం చేయాలి.

చెరువు దిగువ భాగంలో రాతి కట్టడంతో పటిష్టం చేయాలి. బతుకమ్మ ఘాట్, సెంట్రల్ లైటింగ్, వాకింగ్ ట్రాక్, పాత పాల్వంచ, గొల్లగూడెం రెండు వైపులా స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలి. పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు, చెట్లు సందర్శకులు కూర్చునేలా బల్లలు, పిల్లలు ఆడుకునేందుకు పార్క్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

పనుల్లో తీవ్ర జాప్యం...

చింతల చెరువు కట్ట మొత్తం 95 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చెరువు ఆధారంగా సుమారు 350 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. పాల్వంచ, పాత పాల్వంచ రెండింటి మధ్యలో చెరువు ఉండటం దీని ప్రత్యేకత. పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచకు ఈ చెరువు ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. అభివృద్ధి పనులు పూర్తయితే సందర్శకులను విపరీతంగా ఆకట్టుకునే అవకాశం ఉంది. అయితే చెరువు చుట్టూ ఉన్న హద్దులు పెద్దమొత్తంలో కబ్జాకు గురైంది. అక్రమార్కులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపేసుకున్నారు. చెరువుకు పక్కా హద్దులు ఏర్పాటు చేయకపోతే రానున్న రోజుల్లో మరింత ఆక్రమణకు గురయ్యే అవకాశం కూడా ఉంది. ఇదిలా ఉండగా చెరువును మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు మూడేళ్లుగా సాగుతుండగా ఒక్క అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా నడుస్తున్నాయి. నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్‌లు ఆలస్యం చేస్తున్నట్లు తెలుస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ చెరువు అభివృద్ధిపై ఆసక్తి చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా చెరువు ఆధునికీకరణ పనులు పూర్తయితే పర్యాటకులు ఇక్కడకు సందర్శనకు వచ్చే అవకాశం ఉండటంతో పార్కింగ్‌కు స్థలం కేటాయించాల్సి ఉంటుంది. చెరువుకు రెండు వైపులా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ రాణిని వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు.


నత్తనడకన సాగుతున్న పనులు

పనులు నత్తనడక...



పాత పాల్వంచ చింతల చెరువు కట్ట మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. మూడేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులకు నిధుల విడుదలలో ఆలస్యం అవుతోందని చెబుతున్నారు. వెంటనే ప్రభుత్వం నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేసి ట్యాంక్ బండ్‌ను తీర్చిదిద్దాలి. – షేక్ ఖాసీం, పాల్వంచ

త్వరగా పూర్తి చేయాలి..



ట్యాంక్ బండ్ పనులు పూర్తయితే సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. కట్టపై రోడ్డు విస్తీర్ణం, పచ్చదనం, రాతితో పటిష్టం చేయాల్సి ఉంది. అయితే ఈ పనులు ఆలస్యం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. పర్యాటలకు ఆహ్లాదం పంచేందుకు అనువైన స్థలం ఇది. పనులు త్వరగా పూర్తి చేయాలి.– వి.మధుసూధన్, పాల్వంచ